కానుకుంటలో పోచమ్మ ఆలయానికి భూమిపూజ

భూమిపూజలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల,ఆగస్టు16 : గ్రామాల్లో నూతనంగా నిర్మించే ఆలయాలకు తనవంతు సహకారం ఉటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కానుకుంట గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించే పోచమ్మతల్లి అమ్మవారి ఆలయానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్మాణానికి సీజీఆర్ ట్రస్ట్ తరపున ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు నక్కవెంకటేశంగౌడ్, దేవేందర్‌రెడ్డి, సందీప్‌గౌడ్,మాజీ ఉపసర్పంచ్ పలుగు గోవర్ధన్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ ఎర్రోళ్ల శంకర రమేశ్, పోతురాజు పోచయ్య, పోతరాజు శంకరయ్య, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి తొలిగింపు చర్యల పరిశీలన

వరదనీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, ఆగస్టు 16: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలోని రోడ్లు జలమయంగా మారాయి. పలు ఇండ్లలోకి వరదనీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. తక్షణమే వరదనీటి తొలగింపు చర్యలను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మూగ జీవాలను హింసించొద్దు

జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 16 : జంతువులను హింసించే చర్యల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సొసైటీస్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెలిటీ టూ ఎనిమల్స్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. మూగ జీవాల పట్ల ప్రేమను చూపాలన్నారు. వాటి ని హింసించే మనస్తత్వం సరికాదన్నారు. మూగ జీవులను హింసించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో 43,751 కుక్కలు, మున్సిపాలిటీ పరిధిలో 17,770 కుక్కలను గుర్తించామన్నారు. వీటిని (ఏబీసీ) బర్త్ కంట్రోల్ కేంద్రాలకు తరలించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలని సూచించారు. బయట చెత్తను వేయడం ద్వారా అక్కడకు కుక్కలు చేరుతాయని స్పష్టం చేశారు. తద్వారా ప్రమాదాలు జరిగే ప్రమాదమున్నదన్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రవీందర్, డాక్టర్ ప్రభాకర్, నవోదయ వెట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కేతకీలో జడ్జి ప్రత్యేక పూజలు

జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఝరాసంగం, ఆగస్టు 16 : ఝరాసంగం మండల కేంద్రంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయానికి మహారాష్ట్ర బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ శివకుమార్ డీగే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామిని వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం పాల్గొన్నారు.

విమర్శలు మాని ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు16: కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై విమర్శలు మాని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి హితువు పలికారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవులను సైతం తృణప్రాయంగా వదులుకున్న వ్యక్తి హరీశ్‌రావు అని తెలిపారు. ఇప్పటికే ఆరు పథకాల్లో కోతలు, విద్యుత్ కోతలతో ప్రజలు విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. విమర్శలు మాని ప్రజలకు మేలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తే బాగుంటుందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాలు తగదు

రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, ఆగస్టు 16 : బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్‌రెడ్డి సీఎం పదవి వచ్చిన నాటి నుంచి దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీన మవుతదని మరో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు గవర్నర్ పదవి, మాజీ మంత్రి కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి, మాజీ మంత్రి హరీశ్‌రావుకు అసెంబ్లీలో ప్రతిపక్షహోదా అని నోటికొచ్చినట్లు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్‌పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలి

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న సంఘం నాయకులు

కోహీర్, ఆగస్టు16: ఆరోగ్యశ్రీ విభాగంలో 16 యేండ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వైద్యారోగ్య ఐక్య ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జహీరాబాద్ ఏరియా దవాఖానలో విధులు నిర్వహించే ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్రల సంఘం నాయకులు సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలను పెంచాలని కోరారు. ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రలకు వేతనం రూ.22,750 నెలనెలా చెల్లించాలని కోరారు. పీఆర్సీని అమలు చేసి కనీస వేతనం రూ35వేలకు పెంచాలని సూచించారు. ఆరోగ్య కార్డులు, టీఏలు, డీఏ, మృతిచెందితే నష్టపరిహారం అందించాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందోల్ : జోగిపేటలో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని పసుపుబొట్టు వాయినంగా అందిస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

తెల్లాపూర్‌లో వరలక్ష్మీ పూజలో చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని ఆలయాలు, ఇంటింటా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లో లక్ష్మీదేవిని నెలకొల్పి అలంకరణ చేసి పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టామైన నైవేద్యాలు చేసి సమర్పించారు. వరలక్ష్మీ వ్రతం పాటలు పాడుతూ అమ్మవారికి మహిళలందరూ కలిసి మంగళహారతి ఇచ్చారు.

-సంగారెడ్డి జిల్లా నెట్ వర్క్, ఆగస్టు 16

హెరాయిన్, ఓపీఎం పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న టీఎన్‌ఏపీ డీఎస్పీ

పటాన్‌చెరు, ఆగస్టు 16: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో టీఎన్‌ఏపీ డీఎస్పీ పుష్పన్ కుమార్, ఎస్ఓటీ హైదరాబాద్ డీసీపీ శ్రీనివాస్, ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ శంషాబాద్ టీం, పటాన్‌చెరు పోలీసులు శుక్రవారం జాయింట్ ఆపరేషన్ చేసి డ్రగ్స్ పట్టుకున్నారు. గ్రామానికి చెందిన బిగారి మాణిక్యం ఇంట్లో రాజస్థాన్‌కు చెందిన బుధారామ్ అనే వ్యక్తి మాదకద్రవ్యాలు హెరాయిన్, ఓపీఎం అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశారు. నిందితుడు బుధారామ్ (33) స్టీల్ రైలింగ్ వర్క్ చేసుకుంటూ స్థానిక రాధమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతని చిన్నాన కొడుకు కోశాల రామ్ అలియాస్ కమల్ బీడీఎల్ బానూరులో ఉంటూ తక్కువ ధరకు ఈ మాదక ద్రవ్యాలను తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు బుధారామ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8 గ్రాముల హెరాయిన్, 34 గ్రాముల ఓపీఎంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మరో ముద్దాయి కోశాల రామ్ అలియాస్ కమల్ (30) పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్టు చేసి రిమాండ్ చేస్తామని పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు.

శుక్రవారం డ్రైడే పాటించాలి

బొల్లారం, ఆగస్టు 16: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో డ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి అంటు వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్త చర్యలను పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ వార్డు ప్రజలకు సూచించారు. డ్రమ్ముల్లో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా జాగత్తలు పాటించాలని కోరారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని తప్పక పాటించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లో వ్యర్థజలాలు

గుమ్మడిదలలో డ్రైడే నిర్వహిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి, ఈవో ప్రభాకర్

గుమ్మడిదల, ఆగస్టు 16 : మండల వ్యాప్తంగా గురువారం 9.3 సెం.మీటర్ల భారీ వర్షం కురియడంతో ఎక్కడిక్కడే నీరు నిలిచాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇండ్లలోకి నీరు చేరడంతో అధికారులు వెంటనే స్పందించారు. శుక్రవారం ఎంపీడీవో ఉమాదేవి, పంచాయతీ ఈవో ప్రభాకర్ పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. నీరు నిలువుండకుండా జాగ్రతలు తీసుకున్నారు.

పారిశ్రామికవాడల్లో ..

గురువారం సాయంత్రం కురిసిన భారీవర్షానికి పారిన వరదనీటిలో రసాయన పరిశ్రమలు తమ పరిశ్రమలో నిలువ ఉన్న వ్యర్థజలాలను వదిలి చేతులు దులుపుకొన్నారు. ఎప్పుడు వర్షం పడిన వరదనీటితో వ్యర్థజాలలను వదడం తూతూగా మారింది. కాగా ఈ వరదనీరు సమీపంలో ఉన్న బొంతపల్లి అలుకచెరువు, జిన్నారం రాయుడిచెరువు, దోమడుగు రత్నాల చెరువు, నల్లకుంటలో చేరుతుంది. దీంతో చెరువుకింద ఉన్న పంట పొలల్లో పంటలను సాగు చేసుకునే రైతులకు వ్యర్థజలాలతో తీవ్ర నష్టం వాటిలుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై పీసీబీఅధికారులు దృష్టిసారించి సదరు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తక్కడపల్లి మాజీ సర్పంచ్ మృతి

మాజీ సర్పంచ్ చంద్రయ్య

మునిపల్లి,ఆగస్టు 16: మునిపల్లి మండలంలోని తక్కడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చంద్రయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తక్కడపల్లి గ్రామ సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గ్రామానికి చంద్రయ్య చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని గ్రామస్తులు కొనియాడారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామస్తులు ఉన్నారు.

కంగ్టిలో బంద్ ప్రశాంతం

కంగ్టిలో బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆయాయువజన సంఘాల బాధ్యులు

కంగ్టి, అగష్టు 16 : హిందూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కంగ్టిలో బంద్ ప్రశాంతంగా జరిగింది. కంగ్టి మండలంలోని ఆయా యువజన సంఘాలు, హిం దూ సంఘాల ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లోని హిందువులకు జరుగుతున్న అఘాయిత్యా లు, మానభంగాలను నిరసిస్తూ స్వచ్ఛందబంద్ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా నినాదాలు చేస్తూ స్థానిక గణేశ్ మందిరం నుంచి బసవేశ్వర చౌక్ మీదుగా క్రాంతిచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్ హిందువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి అక్కడి హిందువులకు బాసటగా నిలవాలని కోరారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయాయువజన సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చాల్కిగ్రామ మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

న్యాల్‌కల్, ఆగస్టు 16: మండలంలోని చాల్కి గ్రామ మాజీ సర్పంచ్ కుటుంబాన్ని శుక్రవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరామర్శించారు. స్థానిక గ్రామ మాజీ సర్పంచ్ కవితారెడ్డి తండ్రి సంగారెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కైరత్‌పాటేల్, ఆశోక్, కాంతరెడ్డి తదితరులు ఉన్నారు.

సరస్వతీ విగ్రహం ఆవిష్కరణ

మాదారం పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్

జిన్నారం, ఆగస్టు 16 : మండలంలోని మాదారం ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సరస్వతీ మాతా విగ్రహాన్ని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆవిష్కరించారు. రూ.1.20 లక్షలతో సురేందర్ గౌడ్ ఈ విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి చదువులతల్లి సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు చదువుపై ఏకాగ్రతను నిలిపేందుకు సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు.

మహిళా హత్య కేసులో భర్తే హంతకుడు

కేసు ఛేదించిన బొల్లారం పోలీసులు

బొల్లారం, ఆగస్టు 16: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకొని అంతలోనే హతమార్చిన కేసులో నిందితుడిని బొల్లారం పోలీసులు అరెస్టు చేసి జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు. సీఐ గంగాధర్ శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన అప్రతి ఖాతున్‌ను అదే రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ ఇద్దరు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై ప్రేమ పెండ్లి చేసుకుని బొల్లారం తీసుకువచ్చాడు. ఈనెల 13న ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని పాటాన్ పరిశ్రమ పక్కన టీన్ షెడ్డులో బీహార్‌కు చెందిన అప్రతి ఖాతున్ (25) గా పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో క్లూస్ టీం సమగ్ర విచారణ చేపట్టారు. ఈనెల 7న నిందితుడు అనిల్ కుమార్ భార్య అప్రతి ఖాతున్‌ను తీన్ టీన్ షెడ్డులోకి తీసుకెళ్లి పథకం ప్రకారం చున్నీతో గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. వెంటనే అక్కడి నుంచి స్వస్థలమైన బీహార్‌కు పారిపోయాడు. పోలీసులు చాకచక్యంగా విచారణ చేపట్టి నిందితుడు అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి దామోదరకు విన్నవించిన ఎమ్మెల్యే జీఎంఆర్

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 16 : పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.శుక్రవారం హైదరాబాద్ లోని మంత్రి నివాసంలో కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. పటాన్‌చెరుపట్టణంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషలిటీ దవాఖాన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

గ్యాస్ గోదాం భవనాన్ని తరలించండి

వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఆగస్టు 16: పటాన్‌చెరు పట్టణంలో జనావాసాల మధ్య గల ప్రభుత్వ హెచ్‌పీ గ్యాస్ గోదాం భవనాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రుకవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ భేటీ అయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పటాన్చెరు పట్టణంలో గ్యాస్ గోదాం భవనం వరకు విస్తరణ జరుగుతుందని, దీంతో పాటు గోదాం పక్కనే గల పాత తహసీల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కాబోతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మండల పరిధిలోని రామేశ్వరం బండ శివారులో గ్యాస్ గోదాం కి స్థలాన్ని కేటాయించి తరలించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సూచనల మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ హాన్ ను కలిసి ప్రతిపాదన అందజేశారు.

మహాసభలకు ఆహ్వానం

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న పటాన్‌చెరువు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించ తలపెట్టిన రచ్చ సాయి సదస్సుకు హాజరు కావాలని కోరుతూ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు పాల్గొన్నారు.

ఆర్సీపురంలో అమ్మవారికి మంగళహారతి ఇస్తున్న ప్రాటెం మాజీ చైర్మన్ సతీమణి గీతాభూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

గుమ్మడిదల కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మివ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

27న సదరం శిబిరం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 16 : దివ్యాంగుల గుర్తింపు కోసం నిర్వహించే సదరం శిబిరాన్ని ఈ నెల 27న మంగళవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో నిర్వహించనున్నట్లు డీఎం ఆండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి శుక్రవారం తెలిపారు. సంబంధిత స్లాట్స్ పునరుద్ధరణ కోసం ఈ నెల 20న స్లాట్స్ కేటాయించారు.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు

చిలేపల్లిలో ఐదు పిల్లలకు జన్మనిచ్చిన మేక

ఝరాసంగం, ఆగస్టు 16 : మండల పరిధిలోని చిలేపల్లి గ్రామంలో రైతు గొల్ల మల్లయ్యకు చెందిన ఒక మేక శుక్రవారం ఉదయం ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. మేక మొదటి, రెండో కాన్పులో మూడు, మూడో కాన్పులో ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో మూడు పోతు పిల్లలు కాగా రెండు కొదమ పిల్లలు ఉన్నట్లు రైతు తెలిపారు. ఈ విషయం తెలిసి గ్రామస్తులు ఆ పిల్లలను చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

తండాల అభివృద్ధే లక్ష్యం

నాగల్‌గిద్ద, అగష్టు16: మండలంలోని కుమ్మతండా నూతన పంచాయతీగా ఏర్పాటు కావడంతో తండా పెద్దలు శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డిని స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వినోద్‌పాటిల్,శంకర్ ముదిరాజ్, సచిన్‌పాటిల్, జైపాల్‌నాయక్. గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు షెడ్యూలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 16 : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొంది అక్టోబర్ నెలలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ 8008403635 నెంబరుపై సంప్రదించాలన్నారు.

అనుమతి లేని ప్రహరీ కూల్చివేత

జిన్నారం, ఆగస్టు 16 : ఊట్ల గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 616లో అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేయడంతో పాటు అక్రమంగా నిర్మించిన ప్రహరీని పంచాయతీ సెక్రటరీ ప్రవీణ శుక్రవారం కూల్చివేయించారు. అసైన్డ్ భూమిలోంచి రోడ్డు ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేయడంతో అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాలతో సెక్రటరీ ప్రవీణ జేసీబీతో ప్రహరీని కూల్చివేయించారు.

క్రీడా మైదానంలో సౌకర్యాలు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్

సంగారెడ్డి, ఆగస్టు 16 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో క్రీడాకారులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్ అధికారులను కోరారు. శుక్రవారం పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైదానంలో క్రీడా వసతులు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో యూత్ సభ్యులు ప్రేమ్, రఘు, జైరామ్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

అమీన్‌పూర్ ఆగస్టు 16 : శనివారం 33/11 కేవీ అమీన్‌పూర్ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ ఫీడర్స్ ఫీడర్ మెయింటెనెన్స్, కొత్త సర్వీసులు రిలీజింగ్ చేయడం కోసం విద్యుత్ సరఫరా 30 నిమిషాల పాటు నిలిపివేయనున్నట్లు అమీన్‌పూర్ విద్యుత్ ఏ,ఈ వెంకటరాంరెడ్డి తెలిపారు. ఆర్.ఆర్ హోమ్స్ ఫీడర్,కేజీఆర్,సాయి విల్లాస్, గీన్ విల్లాస్, ఆర్ ఆర్ హోమ్స్ , ఎస్ ఎస్ హోమ్స్, భరత్ నగర్ కాలనీ, వెదిరి ఫీడర్, అమీన్‌పూర్ విలేజీ (కొంత ప్రాంతం),సాయి రాజేశ్వరీ, చక్రపురి, ఫ్రెడ్ పార్క్,శ్రీవాణి నగర్, సబ్బే హోప్స్, ఎంపైర్ విడోస్, సాయి అంబికా ఫేస్-1, ఫేస్-2, రాజరాజ్వేరీ కాలనీల్లో 30 నిమిషాలు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జిన్నారం, ఆగస్టు 16 : మండలంలో వివిధ గ్రామాల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శనివారం ఉదయం 9 గంటలకు చెక్కులను పంపిణీ చేయనున్నారని తహసీల్దార్ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదార